# నమస్తే తెలంగాణ
## ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ ఆదివారం 11 ఆగస్టు 2024 | ADILABAD NIRMAL




మైనారిటీ పాఠశాల ఆవరణలో పందుల సంచారం

## ఉట్నూర్‌లోని మైనారిటీ పాఠశాల..

ఉట్నూర్ రూరల్, ఆగస్టు 10 : మైనారిటీ గురుకుల పాఠశాలలో అరకొర వసతుల మధ్య విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సొంత భవనం లేక అద్దె భవనంలో కాలం వెళ్లదీస్తున్నారు. ప్రహరీ లేక శునకాలు, పందులు, పాములు వస్తున్నాయని.. ఎప్పుడు ఏం జరుగుతుందోనని కాలం వెళ్లదీస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిటికీలకు తలుపులు లేకపోవడంతో వర్షం నీరు వస్తుందని, చలికాలంలో చలితో ఇబ్బంది పడుతున్నామని పేర్కొంటున్నారు. డ్రైనేజీ సౌకర్యం లేక మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్గంధం వస్తున్నదని అంటున్నారు.

### వసతులు కల్పించాలి..



మైనారిటీ గురుకుల పాఠశాల తరగతి గదులకు కిటికీలు లేక దోమలు, ఈగలు, పాములతో సహవాసం చేస్తున్నాం. వర్షం కురిసినప్పుడు చాలా ఇబ్బంది అవుతున్నది. ప్రహరీ లేకపోవడంతో పందులు, పశువులు వస్తున్నాయి. వసతులు కల్పించి ఆదుకోవాలి.

*- అనాష్, విద్యార్థి, 10వ తరగతి.*



మైనారిటీ పాఠశాలలో తలుపులులేని కిటికీలు

# సమస్యల వలయంలో గురుకులం

## అద్దె, శిథిల భవనాల్లో కొనసాగుతున్న విద్యాలయాలు

- అరకొర వసతుల నడుమ విద్యార్థుల అవస్థలు
- సరిపడా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక ఇక్కట్లు
- డైనింగ్ హాల్ లేక ఆరుబయట కూర్చొని భోజనం
- మెనూ పాటించని కాంట్రాక్టర్లు
- అర్ధాకలితో అలమటిస్తున్న పిల్లలు
- కరెంట్ పోతే కటిక చీకట్లో భయం భయం
- 'నమస్తే తెలంగాణ' విజిట్‌లో వెలుగు చూసిన నిజాలు

*ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గురుకులాలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అద్దె, శిథిలమైన భవనాల్లో అరకొర వసతుల నడుమ కొనసాగుతుండగా, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టకపోవడంతో విద్యార్థులు అర్ధాకలితో అలమటించాల్సి వస్తున్నది. అనేకచోట్ల పిల్లల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడంతో అష్టకష్టాలు పడాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇక కరెంట్ పోతే కటిక చీకట్లో భయం భయంగా గడపాల్సి వస్తున్నది. రాత్రి సమయంలో విష పురుగులు సంచరిస్తుండడంతో బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. శనివారం 'నమస్తే తెలంగాణ' గురుకులాలను విజిట్ చేయగా, అనేక సమస్యలు వెలుగుచూశాయి.*

*- మంచిర్యాల, ఆగస్టు 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



అద్దె భవనంలో కొనసాగుతున్న తెలంగాణ బీసీ బాలికల పాఠశాల

## ఇరుకు గదుల్లో విద్యార్థులు

భైంసా, ఆగస్టు 10 : ఈ చిత్రాలు చూస్తుంటే జైలో లేక అంతర్జాతీయ వ్యాపార సముదాయ భవనాల మాదిరిగా అనిపిస్తున్నాయి. తెలియని వాళ్లు దూరంగా ఉండి చూస్తే నిజంగా అంతే అనుకుంటారు. అనుకోవడం కాదు నిజంగా వాటిని పోలిన భవనాలే. కానీ.. ఇవీ గురుకుల పాఠశాలలు నిర్వహిస్తున్న అద్దె భవనాలండోయ్.. గురుకులాలు అంటే ఒకప్పుడు పెద్ద పెద్ద భవనాలు, విశాలమైన గదులు, చుట్టూ క్రీడా మైదానం, ఆహ్లాదం కోసం చెట్లు వెరసి, ప్రశాంత వాతావరణంలో విద్యా బోధన జరిగే విద్యాలయాలు. మరీ.. నేడు జనరద్దీ, కూడలీలు, పెద్ద పెద్ద వ్యాపార భవనాలు, ఇరుకు గదులు, చాలీ చాలనీ మరుగుదొడ్లు, తరగతి గదులే వసతి గదులు. అందులో మగ్గుతున్న విద్యార్థులు. ఈ గదుల్లో పదుల సంఖ్యలో విద్యార్థులు వారి బాధలు వర్ణణాతీతం. నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గ కేంద్రమైన భైంసా పట్టణంలో మూడు గురుకుల పాఠశాలలు వీటికి అనుబంధ కళాశాలలు ఉన్నాయి. ఒకటి మైనార్టీ గురుకుల పాఠశాల, మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల, తెలంగాణ బీసీ బాలికల పాఠశాలలో సుమారు 2 వేల మంది వరకు విద్యార్థిని, విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఒక్కొక్క పాఠశాలలో లైబ్రరీ, ల్యాబ్‌ల కోసం పరిశోధన గదులు, భోజనశాలలు, వసతి గదులు ఉండాలి. కానీ.. ఈ గురుకుల పాఠశాలలు, కళాశాలను వ్యాపార నిమిత్తం నిర్మించిన అద్దె భవనంల్లోనే నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా శాశ్వత భవనాలు నిర్మించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



కోతులు, కుక్కలతో వసతి గృహ ప్రాంగణం

## కోతులు, శునకాల బెడద


కడెం, ఆగస్టు 10 : నచ్చన్ ఎల్లాపూర్ టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ (గురుకుల) పాఠశాల, కళాశాలలో విద్యార్థులు సమస్యలతో సతమతం అవుతున్నారు. అయితే తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కడెం మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్‌లో ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఉంది. ఇందులో మొత్తం 620 మంది విద్యార్థులకు శనివారం 558 మంది హాజరయ్యారు. కాగా, ఈ ఏడాది పాఠశాల ప్రారంభం నుంచి విద్యార్థులు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా తాగునీటి సమస్య, మరుగుదొడ్ల సమస్యలు అధికంగా ఉన్నాయి. ప్రధానంగా కోతులు, కుక్కల బెడద అధికంగా ఉంది. వందల సంఖ్యలో కోతులు, పదుల సంఖ్యలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. కోతుల దాడిలో గాయపడ్డ విద్యార్థులు ఉన్నారు. అయితే ఈ విషయమై గతంలో మాజీ సర్పంచ్ బొడ్డు గంగన్న కోతుల నివారణకు చర్యలు తీసుకోగా, ప్రస్తుతం అదే సమస్య పునరావృతం అవుతున్నది. వానకాలం కావడంతో పాఠశాలలోకి భారీగా వరద చేరి అక్కడే నిల్వ ఉంటుంది. దీంతో విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

## తరగతి గదుల్లోనే నిద్ర

నిర్మల్ అర్బన్, ఆగస్టు 10 : నిర్మల్ నియోజకవర్గంలో నాలుగు గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఒకటి రాచాపూర్‌కు గురుకులం కేటాయించారు. దీన్ని అక్కడి నుంచి నిర్మల్‌లోని సోఫినగర్ కాలనీకి మార్చారు. అద్దె భవనంలో తరగతులు నడువగా సరిగ్గా అద్దె చెల్లించక పోవడంతో యజమాని ఖాళీ చేయించాడు. ప్రస్తుతం మా మడకు మారింది. మరో గురుకులం సారంగాపూర్‌కు కేటాయించగా నిర్మల్ పట్టణంలోని శాంతినగర్ అద్దె భవనంలో అరకొర సౌకర్యాల మధ్య కొనసాగుతున్నది. దిలావర్‌పూర్ మండలానికి చెందిన గురుకుల పాఠశాల ప్రస్తుతం ట్యాంక్ బండ్ వద్ద గల భవనంలో తరగతులు కొనసాగుతున్నాయి. మరొకటి చించోలిలో డిగ్రీ కళాశాల కొనసాగుతున్నది. అన్నీ అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య తరగతులు నడుస్తున్నాయి.

### ఆట స్థలాలు లేవు..

గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు లేకపోవడంతో అరకొర అద్దె గదుల్లో తరగతులు కొనసాగుతున్నాయి. విద్యార్థులు రాత్రి వేళల్లో పడుకునేందుకు ప్రత్యేక హాల్‌లు లేక తరగతి గదుల్లోనే ఉదయం పాఠాలు విని రాత్రివేళల్లో అక్కడే పడుకుంటున్నారు. చదువుకునేందుకు రీడింగ్ హాల్‌లు, తినేందుకు డైనింగ్ హాలు, చదువుల సంగతి ఇలా ఉంటే విద్యార్థుల మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదం చేయనుండగా ఆటలు ఆడేందుకు స్థలాలు లేక చదువులకే పరిమితం అయ్యారు.



అద్దె గదుల్లో కొనసాగుతున్న నిర్మల్‌లోని గురుకుల పాఠశాల

## విత్తన దుకాణాల్లో ఎలాంటి క్యూలు లేవు

- ఆగస్టు నెలలో పత్తి విత్తనాలు విక్రయాలు జరగడం లేదు..
- జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్య



పుల్లయ్య, ఆదిలాబాద్ జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఆదిలాబాద్, ఆగస్టు 10(నమస్తే తెలంగాణ) : శనివారం 'నమస్తే తెలంగాణ' ప్రధాన దినపత్రికలో వచ్చిన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో విత్తన దుకాణాల ఎదుటబారులు తీరిన రైతులు కథనాన్ని జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్య ఓ ప్రకటనలో ఖండించారు. సత్యదూరమైన వార్త అని పేర్కొన్నారు. జిల్లాలో ఆగస్టులో ఎలాంటి పత్తి విత్తనాల విక్రయాలు జరగడం లేదన్నారు. శుక్రవారంతోపాటు జూలై, ఆగస్టు నెలల్లో రైతులు పత్తి విత్తనాల కోసం ఎలాంటి వరుసలు కట్టలేదని తెలిపారు. జిల్లాలో రైతులు పత్తి పంటను 4.35 లక్షల ఎకరాల్లో వేశారని, పంట 45 నుంచి 60 రోజుల దశలో ఉందన్నారు. వరి విత్తనాలను ఉట్నూర్ మండలంలో విక్రయిస్తున్నట్లు ఇప్పటి వరకు 1336 ఎకరాల్లో రైతులు వరిని సాగు చేశారన్నారు. జిల్లాలో ఎలాంటి దుకాణాల్లో క్యూలు లేవని తెలిపారు.



ఇంద్రవెల్లి : సిరాళ్ ఉత్సవాల్లో మహిళలు



బజార్‌హత్నూర్‌లో సిరాళ్ వేడుకల్లో పాల్గొన్న ఆదివాసులు

## పల్లెల్లో సిరాళ్ సందడి

### సంప్రదాయ పాటలపై ఆడిపాడిన గిరిజన మహిళలు

ఇంద్రవెల్లి, ఆగస్టు 10 : అంజీ, మామిడిగూడ, కైలాస్ నగర్, అంద్‌గూడ, దస్నాపూర్, దస్నాపూర్‌గూడ గ్రామాల్లో అంద్ ఆదివాసీ సమాజ్ ఆధ్వర్యంలో సిరాళ్ పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శనివారం సిరాళ్ దేవతతోపాటు కులదేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించడానికి ఇతర గ్రామాలకు చెందిన అంద్ ఆదివాసీ సమాజ్ ప్రజలు గ్రామాలకు తరలివచ్చారు. ముందుగా మహిళల ఆధ్వర్యంలో సిరాళ్ దేవతను గ్రామంలో ఉరేగింపు చేసి, అనంతరం హనుమాన్ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ సిరాళ్ దేవత విగ్రహంతో గ్రామాల్లో భారీగా శోభాయాత్ర నిర్వహించారు. గ్రామం మధ్యలో సిరాళ్ దేవతను పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. అంద్ ఆదివాసీ సమాజ్ సంస్కృతి సంప్రదాయం ప్రకారం మహిళలు సంప్రదాయ నృత్యాలు చేస్తూ ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో మహిళలు ముకాడే సంగీత, గారుళే కుసుమబాయి, విజయబాయి, జనబాయి, లక్ష్మీబాయి, కవితబాయి, పుంజీబాయి, బాగాబాయి, సుసేలబాయి, తదితరులు పాల్గొన్నారు.

### బజార్‌హత్నూర్‌లో..

బజార్‌హత్నూర్, ఆగస్టు 10 : బజార్‌హత్నూర్ మండలంలోని కోల్హారి, బజార్‌హత్నూర్ గ్రామాల్లో శనివారం సిరాళ్ వేడుకలను ఆదివాసీ మహిళలు జరుపుకున్నారు. పెళ్లికాని యువతులు, మహిళలు వేడుకల్లో పాల్గొంటే అనుకున్న పనులు జరుగుతాయని ఆదివాసుల నమ్మకం. అంతకు ముందు ఊరేగింపుగా వెళ్లి కడెం వాగులో సిరాళ్ ప్రతిమలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు జల్కె పాండురంగ్, తదితరులు పాల్గొన్నారు.

## గల్ఫ్ బాధితుడిని రక్షించేందుకు చర్యలు

నిర్మల్ చైన్‌గేట్/ముథోల్, ఆగస్టు 10 : నిర్మల్ జిల్లాకు చెందిన గల్ఫ్ బాధితుడు నాందేవ్‌ను రక్షించేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం ట్విట్టర్ వేదికగా తెలిపారు. కువైట్ దేశంలోని ఎడారిలో ఒంటెలు కాస్తున్న ముథోల్ మండలంలోని రువ్వి గ్రామానికి చెందిన నాందేవ్ ఎడారిలో అవస్థలు పడుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీనిపై స్పందించిన జిల్లా యంత్రాంగం కువైట్ రాయబార కార్యాలయాన్ని సంప్రదించింది. ప్రస్తుతం అతను క్షేమంగా ఉన్నాడని, అతనిని తిరిగి రప్పించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎక్స్(ట్విట్టర్) వేదికగా వెల్లడించారు.

## చీటింగ్ చేస్తే రౌడీషీట్ తెరుస్తాం..

**- నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల**

నిర్మల్ అర్బన్, ఆగస్టు 10 : బహిరంగ ప్రదేశాల్లో అసభ్యకరమైన ప్రతికూల వ్యాఖ్యలు మహిళలపై చేసినట్లయితే ఉపేక్షించేది లేదని ఎస్పీ జానకి షర్మిల హెచ్చరించారు. ఈ సందర్భంగా శనివారం ఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మహిళలను లైంగిక వేధింపులకు గురి చేసినట్లయితే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని అన్నారు. కాలేజీలు, స్కూల్స్, షాపింగ్ మాల్స్ వంటి ప్రదేశాల్లో నిత్యం పోలీసులు, షీ టీమ్స్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళలపై దుసురుగా ప్రవర్తించే వారిపై పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు.

## దోపిడీ దొంగల ముఠా అరెస్టు

నిర్మల్ చైన్‌గేట్, ఆగస్టు 10 : బస్టాండ్‌లో దోపిడీకి పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు నిర్మల్ పట్టణ పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. నిర్మల్ జిల్లా ముథోల్ మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన చుక్కల విఠల్ తమ మనవడికి ఆరోగ్యం బాగాలేకపోతే నిర్మల్‌లో ఆసుపత్రిలో చూపించేందుకు శుక్రవారం వచ్చాడు. విఠల్‌ను గమనించిన రాపని శ్రీను, వేముల సుజాత, రాజమణి ముగ్గురు వారిని అడ్డగించి విఠల్ మెడలో ఉన్న 6 గ్రాముల బంగారం, జేబులోని రూ. 950, సెల్‌ఫోన్ దోచుకుని పారిపోయారు. బాధితుడు నిర్మల్ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా పట్టణ సీఐ, స్పందించి దోపిడీ దొంగలను బస్టాండ్ ఏరియాలో పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.





నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు



మధ్యాహ్నం 3 గంటలకు ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ

## విధుల్లో వైద్యసిబ్బంది నిర్లక్ష్యం

పెంబి, ఆగస్టు 10 : పెంబి పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి పెంబితండా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. సిబ్బంది ఒక్కరూ కూడా లేకపోవడంతో కుటుంబ సభ్యులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ' నమస్తే తెలంగాణ' పీహెచ్‌సీని సందర్శించగా అంకెన సబ్ సెంటర్ ఎంఎల్‌హెచ్‌పీ అంజలి, అటెండర్ జయమ్మ మాత్రమే విధుల్లో ఉన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ నర్స్, ఫార్మాసిస్టు, ల్యాబ్ సిబ్బంది ఎవరు విధులకు హాజరుకాలేదు. మెడికల్ ఆఫీసర్ శాంతన్‌ను వివరణ కోరగా తను సెలవులో ఉన్నానని, పీహెచ్‌సీకి ముగ్గురు స్టాఫ్‌నర్సులకు బదులు ఇద్దరు మాత్రమే ఉండడంతో ఇబ్బందులు కలుగుతున్నాయని, అలాగే ఫార్మాసిస్టు కూడా సెలవులో ఉన్నట్లు వెల్లడించారు. పెంబి మండలంలో ఎక్కువ మంది గిరిజనులే ఉన్నారని, నిత్యం పీహెచ్‌సీకి అధిక సంఖ్యలో రోగులు వస్తారని, ఉన్నత అధికారులు స్పందించి పీహెచ్‌సీ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఖాళీగా ఉన్న ఫార్మాసిస్టు గది

## ఆలయంలో చోరీ

### గంటల వ్యవధిలో దొంగలను పట్టుకున్న పోలీసులు

కుభీర్, ఆగస్టు 10 : మండలకేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గుడి గంటతోపాటు సిలిండర్, హుండి పెట్టెను ఎత్తుకెళ్లారు. ఈ విషయమై గౌడ సంఘం అధ్యక్షుడు చేపూరి కనకాగౌడ్ ఉదయం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అప్రమత్తమైన కుభీర్ ఎస్సై రవీందర్ సిబ్బందితో కలిసి ముందుగా రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని పరిశీలించారు. అనంతరం భైంసా రహదారిలోని గ్రామాల్లో విచారణ చేపట్టారు. చొండి గ్రామంలోని సాయిబాబా ఆలయంలో గుడి గంటను గుర్తించారు. పాంగ్రా గ్రామంలో సిలిండర్ అమ్ముతుండగా ఆ గ్రామస్తుల సమాచారంతో దొంగలిరువురిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. గంటల వ్యవధిలోనే చోరి కేసును ఛేదించిన ఎస్సై రవీందర్‌తోపాటు సిబ్బందిని గ్రామస్తులు, గౌడ కులస్తులు అభినందించారు. చొండి గ్రామానికి చెందిన చాకలి మహేశ్, భైంసా పట్టణం ఓవైసీ నగర్‌కు చెందిన తురబ్‌ఖాన్ ఈ చోరీకి పాల్పడినట్లు వివరించారు.



పట్టుకున్న సామగ్రితో ఎస్సై, పోలీసులు



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్

## వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

**డీఎంహెచ్‌వో నరేందర్**

ఉట్నూర్ రూరల్, ఆగస్టు 10 : వర్షాకాలంలో వ్యాధుల నియంత్రణకు గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వో నరేందర్ అన్నారు. శనివారం మండలంలోని శ్యాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టరును పరిశీలించి, వైద్యం అందుతున్న తీరును పరిశీలించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. సిబ్బంది సమయ పాలన పాటించాలని, వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సందీప్ రాథోడ్, సిబ్బంది ఉన్నారు.